సాక్షి సంగారెడ్డి

శుక్రవారం । 23 । ఆగస్టు । 2024



మహిళా క్లినిక్.. సూపర్ సక్సెస్

ఆరోగ్య మహిళా క్లినిక్‌లు సత్ఫలితాలనిస్తున్నాయి. మహిళలకు అవసరమైన వైద్య సేవలు అందుతున్నాయి. వివరాలు 8లో ▸



మద్యం.. ఇష్టారాజ్యం

వైన్స్ నిర్వాహకులు ధనార్జనే ధ్యేయంగా ఎక్సైజ్ అధికారుల అండదండలతో బెల్ట్ షాపులను ప్రోత్సహిస్తున్నారు. వివరాలు 8లో ▸

దరఖాస్తుల ఆహ్వానం

సంగారెడ్డి జోన్: బాలలు, పిల్లల సంరక్షణకు కృషి చేస్తున్న స్వచ్ఛంద సేవా సంస్థల నుంచి ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డులకు గాను దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు మహిళా, శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి లలిత కుమారి గురువారం పేర్కొన్నారు. అర్హులైన వారు ఈనెల 31వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు వెబ్ సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

మంత్రులకే క్లారిటీ లేదు

అడ్డగోలు ఆంక్షలు.. అర్థం లేని షరతులపై ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆగ్రహం


ధర్నాలో సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, బీఆర్ఎస్ నాయకులు

సంగారెడ్డి టౌన్ : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో హామీలు ఇచ్చి అబద్దాలతో రైతుల నడ్డి విరిచిందని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ దేవిదాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులకు నట్టేటముంచే ఆలోచనతో రూ.2లక్షల రుణమాఫీ తూతూ మంత్రంగా చేశారని ఆరోపించారు. కొంతమాఫీ చేసి పూర్తి స్థాయిలో చేసినట్లు చెబుతున్నారు. దానిపై మంత్రులకే క్లారిటీ లేదు.. ఒక మంత్రి ఒకలా, ఇంకో మంత్రి ఇంకోలా పూటకో మాట రోజుకో తీరు అడ్డగోలు ఆంక్షలు అర్థం లేని షరతులతో రైతులను మోసం చేస్తున్నారన్నారు. వెంటనే రైతులకు ఇచ్చిన మాట ప్రకారం అందరికీ రుణమాఫీ, ఆరు గ్యారంటీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ మంజుశ్రీ, సీడీసీ మాజీ చైర్మన్ బుచ్చిరెడ్డి, బీఆర్ఎస్ సంగారెడ్డి మండలాధ్యక్షులు చక్రపాణి పాల్గొన్నారు.

కొర్రీలు లేకుండా రుణమాఫీ

- ఎమ్మెల్యే మాణిక్‌రావు డిమాండ్
- ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా


తహసీల్దార్ రవీందర్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు తదితరులు

జహీరాబాద్: ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన వాగ్దానం మేరకు ఎలాంటి కొర్రీలు పెట్టకుండా రైతులందరికీ రుణమాఫీ చేసి అప్పుల ఊబి నుంచి బయట పడేయాలని ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు డిమాండ్ చేశారు. గురువారం బీఆర్ఎస్ అధిష్టానం పిలుపు మేరకు జహీరాబాద్‌లోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ రైతుకు రుణమాఫీ చేయాలన్నారు. ఇందు కోసం రూ.49 వేల కోట్లు అవసరం అవుతాయన్నారు. ప్రభుత్వం కేవలం రూ.7 వేల కోట్లు మాత్రమే మాఫీ చేసి చేతులు దులుపుకొందని విమర్శించారు. ఎన్నికల్లో చెప్పింది ఒకటి, ఇప్పుడు చేస్తుంది ఒకటని విమర్శించారు. మాఫీలో కటాఫ్ తేదీ పెట్టడం, కొర్రీలు పెట్టి మోసం చేస్తోందని ధ్వజమెత్తారు. మాజీ మంత్రి హరీశ్‌రావు నాజీనామా చేస్తా అంటేనే ఈ మాత్రమైన రుణమాఫీ జరిగిందన్నారు. జూన్‌లోనే రైతు బంధు డబ్బులు పడాల్సి ఉన్నా ఇప్పటి వరకు వారి ఖాతాల్లో వేయలేదన్నారు. వై.నరోత్తం, ఎం.శివకుమార్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ప్రభుత్వ న్యాయవాదిగా ప్రభు బాధ్యతల స్వీకారం

సంగారెడ్డి టౌన్ : సంగారెడ్డి జిల్లా కోర్టులో ప్రభుత్వ న్యాయవాదిగా ప్రభు దాన్యం గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవాని చంద్రను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తరపున తన వాదనలు జిల్లా కోర్టులో వినిపిస్తానని పదవికి న్యాయం చేస్తానన్నారు. ఆయన వెంట న్యాయవాదులు పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్ మార్చాలి


ఆర్డీఓ ఏఓకు వినతి పత్రం అందజేస్తున్న గిర్మాపూర్, పెద్దాపూర్ భూ బాధితులు

కొండాపూర్(సంగారెడ్డి): ట్రిపుల్‌ఆర్ కోసం సేకరిస్తున్న రహదారి అలైట్‌మెంట్‌ను మార్చాలని గిర్మాపూర్, పెద్దాపూర్ భూ బాధితులు గురువారం ఆర్డీఓ, ఇరిగేషన్ ఎస్ఈకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మల్కాపూర్ చెరువు ఆయకట్టు కింద రెండు పంటలు పండే భూములు ఉన్నాయన్నారు. అందులో నుంచి కాకుండా పక్కనున్న అసైన్డ్ భూముల నుంచి రహదారి వెళ్లేలా అలైన్‌మెంట్ మార్చాలని కోరారు. నిబంధనల ప్రకారం ఆయకట్టు భూముల నుంచి రహదారి వేయకూడదనే నిబంధన జీఓలో ఉందన్నారు. వీటిని పరిశీలించి ఇరిగేషన్ అధికారులు ప్రభుత్వానికి నివేదికను ఇచ్చి అలైన్‌మెంట్‌ను మార్చేలా కృషి చేయడంతో పాటు రెండు గ్రామాల ప్రజలను ఆదుకోవాలని కోరారు.

బస్సు సర్వీస్‌ను పునరుద్ధరించండి


డిపో మేనేజర్‌కు వినతి పత్రం అందజేస్తున్న పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు సందీప్

సంగారెడ్డి ఎడ్యుకేషన్: విద్యార్థుల కళాశాలల సమయానికి బస్సు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు సందీప్ వాపోయారు. గురువారం సంగారెడ్డిలోని ఆర్టీసీ డిపో మేనేజర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం డిపో మేనేజర్ ఉపేందర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సందీప్ మాట్లాడుతూ, విద్యార్థులకు అనుకూలమైన సమయంలో బస్సు కేటాయించకపోవడం వల్ల విద్యార్థులు నష్టపోతున్నారన్నారు. 60 మంది ఎక్కాల్సిన బస్సులో 140 మంది ప్రయాణిస్తున్న పరిస్థితి ఉందన్నారు. దీంతో చాలా ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కేవలం విద్యార్థుల నిమిత్తం సంగారెడ్డి నుంచి కొండాపూర్ మండలం గంగారం వరకు ప్రత్యేక బస్సు ఉండేదని, దానిని ఎత్తేయడంతో ఇబ్బందులు ఎక్కువయ్యాయని తెలిపారు. అధికారులు స్పందించి విద్యార్థుల సమస్యలను దృష్టిలో ఉంచుకొని యధావిధిగా ప్రత్యేకమైన బస్సు కేటాయించాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో మారేపల్లి, గంగారం, తొగర్‌పల్లి తదితర గ్రామాల విద్యార్థులున్నారు.

ఓపెన్ స్కూల్‌తో ఉపయోగం

సంగారెడ్డి టౌన్ : చదువు మధ్యలోనే మానేసి తిరిగి విద్యను కొనసాగించేందుకు ఓపెన్ స్కూల్ ఉపయోగపడుతుందని ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్ వెంకటస్వామిగౌడ్ అన్నారు. గురువారం సంగారెడ్డి మండలం ఇస్మాయిల్ ఖాన్ పేట.. ప్రభుత్వ పాఠశాలలో ఓపెన్ స్కూల్ లో పదవ తరగతి, ఇంటర్ చదువుకోవడానికి వీలుగా ఉంటుందన్నారు. దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. చదువు మధ్యలో మానేసిన వారు దీనిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

ఎట్టకేలకు బదిలీ వేటు!

- పాతుకుపోయిన అధికారికి స్థాన చలనం
- అక్కడ చేరకుండా పైరవీలు
- ఇరిగేషన్ శాఖలో చర్చనీయాంశమైన బదిలీ ఉత్తర్వులు




నీటిపారుదల శాఖ కార్యాలయం

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి : నీటిపారుదల శాఖలో చాలా ఏళ్లుగా ఒకే చోట పాతుకు పోయిన ఓ కీలక ఉన్నతాధికారిపై ఎట్టకేలకు బదిలీవేటు పడింది. పలు ఆరోపణలు, విమర్శలు ఎదుర్కొంటూ సుమారు ఆరేళ్లకు పైగా తిష్టవేసిన ఈ అధికారికి స్థాన చలనం కల్పిస్తూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. పరిపాలన సౌలభ్యం పేరుతో ఈ అధికారికి మారుమూల ప్రాంతానికి పంపుతూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ అధికారి 2018 ఆగస్టు నుంచి సంగారెడ్డిలోనే పని చేస్తున్నారు. సంగారెడ్డి, కంది, పటాన్‌చెరు, అమీన్‌పూర్, రామచంద్రాపురం, జిన్నారం, గుమ్మడిదల తదితర మండలాల్లో వందల చెరువులు, కుంటల కబ్జాలకు ఈ అధికారి పరోక్షంగా సహకరించారనే ఆరోపణలున్నాయి. చెరువులను కబ్జాలకు గురికాకుండా కాపాడాల్సిన ఈ అధికారే కబ్జాకోరులకు పరోక్షంగా సహకరిస్తూ వచ్చారనే విమర్శలు ఎదుర్కొన్నారు. తమ గ్రామంలోని చెరువు కబ్జాకు గురైందని ఫిర్యాదులొస్తే కాపాడేందుకు కనీస చర్యలు చేపట్టలేదు. ఆక్రమణలపై కళ్లు మూసుకుని ఈ అధికారి కాసులు దండుకుంటారనే విమర్శలు ఉన్నాయి.

కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజాఫిర్యాదుల విభాగం నుంచి వచ్చిన చెరువుల కబ్జా ఫిర్యాదులను సైతం ఈ అధికారి పక్కన బెట్టేశారు. కాగా సాధారణంగా నీటిపారుదల శాఖలో ఇంజినీరింగ్ అధికారులు రెండు, మూడేళ్లకే బదిలీలు జరుగుతుంటాయి. ఏదైనా ప్రభుత్వ ప్రతిష్టాత్మక ప్రాజెక్టుల్లో పని చేసే అధికారులకు మాత్రమే అతి కొద్దిమందికి మాత్రమే మినహాయింపు ఉంటుంది. కానీ ఎలాంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టు లేకపోయినప్పటికీ.. సదరు అధికారి ఇక్కడే ఏళ్ల తరబడి తిష్ట వేశారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో ఈ అధికారిని బదిలీ చేస్తూ ప్రత్యేకంగా ఉత్తర్వులు జారీ చేయడం ఆశాఖలో చర్చనీయాంశంగా మారింది.

ఏ పార్టీ అధికారంలో ఉంటే..

ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ ప్రజాప్రతినిధుల పంచన చేరే ఈ అధికారి ఇప్పుడు బదిలీ అయిన స్థానంలో పనిచేసేందుకు ససేమిరా అంటున్నారు. ఇక్కడి నుంచి రిలీవ్ అయినప్పటికీ బదిలీ అయిన స్థానంలో చేరలేదు. బదిలీ ఉత్తర్వులు వచ్చి వారం రోజులు దాటినప్పటికీ బదిలీ చేసిన స్థానంలో రిపోర్టు చేయలేదు. మళ్లీ కాసులు కురిపించే పోస్టు కోసం ఆయన ఓ అమాత్యుని ఆశీస్సుల కోసం ప్రయత్నాలు కొనసాగిస్తుండటం నీటి పారుదలశాఖలో చర్చనీయాంశంగా మారింది.

ఎన్‌జీటీ మొట్టికాయ వేసినా..

■ జిల్లాలో పలు చెరువులు కబ్జాలకు గురైనప్పటికీ నీటి పారుదల శాఖ అధికారులు కనీస చర్యలు చేపట్టకపోవడంతో కొందరు ఏకంగా (ఎన్‌జీటీ) నేషనల్ గ్రీన్ ట్రిబ్యూనల్‌ను ఆశ్రయించిన ఘటనలు ఉన్నాయి. ప్రధానంగా అమీన్‌పూర్ పెద్ద చెరువు కబ్జాపై చేసిన నేషనల్ గ్రీన్ ట్రిబ్యూనల్ నీటిపారుదల శాఖ అధికారులకు మొట్టికాయలు వేసింది. వీటిపై తక్షణం చర్యలు తీసుకుని, నివేదికలు పంపాలని ఎన్‌జీటీ అప్పట్లో కలెక్టర్‌ను సైతం ఆదేశాలు జారీ చేసింది. ఇలా రూ.కోట్లు విలువ చేసే చెరువు భూములను కాపాడటంతో కీలక పాత్ర పోషించాల్సిన ఈ అధికారి కబ్జాదారులకు సహకరించడం ద్వారా పెద్ద మొత్తంలో దండుకున్నారనే విమర్శలు ఎదుర్కొంటున్నారు. సదరు అధికారి వ్యవహారాలన్నీ ప్రస్తుత ప్రభు త్వం దృష్టికి రావడంతో ఆయన్ను ఓ మారు మూల ప్రాంతానికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ఆ కుక్కలు ఇక్కడివి కావట!

- అక్రమాలను కప్పిపుచ్చుకునేందుకు అధికారుల ప్రయత్నాలు
- స్టెరిలైజేషన్ పేరుతో బిల్లులు డ్రాపై తీవ్ర విమర్శలు
- సాక్షి కథనంతో కదలిక


సంగారెడ్డి మున్సిపాలిటీ

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : వీధి కుక్కలకు స్టెరిలైజేషన్ (ప్రత్యుత్పత్తి జరగకుండా) ఆపరేషన్ల పేరుతో జరిగిన అక్రమాలపై సంగారెడ్డి బల్దియా అధికారులు కప్పిపుచ్చుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. అధికారులు, పాలకవర్గంలోని కీలక ప్రజాప్రతినిధులు కలిసి ఒక్కో కుక్కకు రూ.1,299 చొప్పున 7,102 శునకాలకు సుమారు రూ.92 లక్షలకు పైగా బిల్లులు డ్రా చేసిన వ్యవహారాన్ని 'సాక్షి' వెలుగులోకి తెచ్చింది. కు.ని.పేరిట నొక్కేశారు అనే శీర్షికతో సమగ్ర కథనం ప్రచురితమైంది. ఈ వ్యవహారాన్ని అధికారులు కప్పిపుచ్చుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. పట్టణంలో కుక్కల నియంత్రణ చర్యలు చేపట్టకపోవడంతో పట్టణంలో మందలు మందలుగా సంచరిస్తున్నాయి. ఏ వీధిలో చూసినా పదుల సంఖ్యలో దర్శనమిస్తున్నాయి. స్థానికులపై తరచూ దాడులకు పాల్పడుతున్నాయి. రెండు చోట్ల ఇద్దరు చిన్నారులపై దాడులు చేస్తే ఆ చిన్నారులు ఆస్పత్రుల పాలైన ఘటనలు కూడా ఉన్నాయి. పట్టణంలో కుక్కల పరిస్థితి ఇలా ఉంటే అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి ఈ కుక్కలకు స్టెరిలైజేషన్ పేరుతో బిల్లులు డ్రా చేయడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది.

ఆ కుక్కలను గ్రామాల నుంచి తెచ్చి వదిలారటా..

పట్టణంలో స్టెరిలైజేషన్ చేయని కుక్కలు 4,960 ఉన్నట్లు పారిశుద్ధ్య విభాగం ఇటీవల నిర్వహించిన సర్వేలో తేల్చింది. ఇప్పటికే 7,102 కుక్కలకు స్టెరిలైజేషన్ చేస్తే ఈ 4,960 కుక్కలు ఎక్కడివనే ప్రశ్న ఎదురవుతోంది. దీన్ని కప్పిపుచ్చుకునేందుకు బల్దియా అధికారులు చెబుతున్న సమాధానం ఏమిటంటే ఈ కుక్కలను సమీప గ్రామాల నుంచి తెచ్చి వదిలారని కప్పిపుచ్చుకుంటుండటం గమనార్హం. అవినీతి అక్రమాలకు నిలయంగా మారిన సంగారెడ్డి బల్దియాలో పారిశుద్ధ్యం విభాగంలో ప్రతి నెలా బిల్లుల బాగోతం కొనసాగుతోంది. గతంలో పారిశుద్ధ్య కార్మికులు పని చేయకుండానే పని చేసినట్లు రికార్డులు సృష్టించి వారి పేరుతో ప్రతి నెలా రూ.లక్షల్లో జీతభత్యాలు డ్రా చేసిన విషయం విదితమే. ఈ అవినీతి బాగోతంపై అధికార పార్టీ పాలకవర్గం కౌన్సిలర్లే ఫిర్యాదులు చేసుకోవడం అప్పట్లో చర్చనీయాంశంగా మారింది. తాజాగా ఇదే పారిశుద్ధ్య విభాగంలో ఇప్పుడు కుక్కల స్టెరిలైజేషన్ పేరుతో రూ.92 లక్షలు నిధులు డ్రా చేయడం పట్ల తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఫేక్ కాల్స్‌పై అప్రమత్తంగా ఉండాలి

- సైబర్ కేటుగాళ్లకు తల్లిద్రండులు డబ్బులు పంపొద్దు
- ఎస్పీ చెన్నూరి రూపేశ్
- సైబర్ నేరాల నిర్మూలనపై అవగాహన ఉంటే మంచిది



మాట్లాడుతున్న ఎస్పీ రూపేశ్

సంగారెడ్డి జోన్: తల్లిదండ్రులు తమ కుమారుడు లేదా కూతురు అరెస్టు అయ్యి పోలీసు కస్టడీ లో ఉన్నారని, డబ్బులు పంపిస్తే కేసు లేకుండా వదిలేస్తామని చెబితే నమ్మొద్దని ఎస్పీ చెన్నూరు రూపేశ్ అన్నారు. సీబీఐ, ముంబయి పోలీస్, ఈడీ తదితర శాఖల నుంచి ఫోన్లు వస్తే భయపడాల్సిన అవసరం లేదన్నారు. గురువారం ఎస్పీ కార్యాలయంలో జిల్లా పోలీసు అధికారులతో కలిసి ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సైబర్ నేరాలతో మోసపోకుండా ఉండేందుకు, ప్రతీఒక్కరు సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ నేరాల నియంత్రణపై ప్రజలకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. సైబర్ నేరగాళ్లు సులభంగా డబ్బును సంపాదించేందుకు, తప్పుడు మార్గాలను ఎంచుకొని, వివిధ రకాల సైబర్ నేరాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. అవగాహన కలిగి ఉంటే సైబర్ నేరాల నుంచి బయట పడవచ్చన్నారు. సోషల్ మీడియాలో వచ్చే లింకులు, ఫేక్ ఫైల్స్ ఓపెన్ చేయరాదన్నారు. అందులో పెట్టుబడులు పెట్టరాదన్నారు. ఆన్‌లైన్‌లో అపరిచిత వ్యక్తుల నుంచి దూరంగా ఉండాలన్నారు. ఒకవేళ సైబర్ మోసాలకు పాల్పడితే 1930 నంబర్‌లో ఫిర్యాదులు చేయొచ్చన్నారు. అదనపు ఎస్పీ సంజీవరావు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

24న ఫ్రీడం వాక్

సంగారెడ్డి జోన్: డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టేందుకు జిల్లా పరిపాలన విభాగం, పోలీసు విభాగం ఆధ్వర్యంలో ఈనెల 24న ఫ్రీడం వాక్ నిర్వహిస్తున్నట్లు ఎస్పీ చెన్నూరి రూపేశ్ గురువారం తెలిపారు. మాదకద్రవ్యాల నిర్మూలనే లక్ష్యంగా విస్తృతస్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ప్రజలు, యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. వాటి నుంచి విముక్తి కోసం డిఅడిక్షన్ లో క్యాంపెయిన్ భాగంగా ఈనెల 24న ఉదయం 7 గంటలకు కలెక్టరేట్ నుంచి కోర్టు వరకు ప్రధాన రహదారి గుండా సాగుతోందన్నారు. అధికారులు, ప్రజలు, యువత అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సూచించారు.

ఆ ఉపాధ్యాయులను విధుల్లోకి తీసుకోవాలి

సంగారెడ్డి ఎడ్యుకేషన్: సస్పెండైన ఉపాధ్యాయులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం జిల్లా విద్యాధికారి డీఈఓ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేశారు. చిన్న, చిన్న కారణాలను సాకులుగా చూపుతూ ఉపాధ్యాయులను సస్పెండ్ చేయడం సరైంది కాదన్నారు. ఏదైనా పొరపాట్లు చేస్తే ముందుగా షోకాజ్ నోటీసులు జారీ చేసి వివరణ, సంజాయిషీ తీసుకోవాలని సూచించారు. ఇది సరిగ్గా లేకపోతే అప్పుడు సస్పెండ్ చేయాలన్నారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు మదన్‌గోపాల్, సయ్యద్ సాబేర్ పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ తప్పనిసరి

కలెక్టర్ క్రాంతి


విద్యార్థినితో మాట్లాడుతున్న కలెక్టర్ క్రాంతి

కంది(సంగారెడ్డి): విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాలు అందించి వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ క్రాంతి అన్నారు. గురువారం మండల పరిధిలోని కాశిపూర్ లో గల కస్తూర్బా మైనారిటీ గురుకుల పాఠశాలను ఆమె ఆకస్మికంగా తనఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు బోధిస్తున్న పాఠాల్లో కొన్ని ప్రశ్నలు అడిగి విద్యార్థుల నుంచి సమాధానాలు రాబట్టారు. నూతన పద్ధతుల ద్వారా బోధిస్తే వారికి సులువుగా అర్థమవుతుందన్నారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో సీజనల్ వ్యాధుల పై అవగాహన కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. విద్యార్థులకు ఏవైనా ఆరోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే ఉన్నత అధికారులకు సమాచారం అందజేసి వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొవ్వొత్తుల ర్యాలీ



కొవ్వొత్తులతో ర్యాలీ చేస్తున్న బ్యాంకు ఉద్యోగులు

కోల్‌కతాలో వైద్య విద్యార్థి అత్యాచారం, హత్య ఘటనను నిరసిస్తూ గురువారం బ్యాంకు ఉద్యోగుల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని కొత్త బస్టాండ్ నుంచి ప్రభుత్వ అతిథి గృహం వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. బాధితురాలి కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. వైద్యులు, వైద్య విద్యార్థులు, మహిళలు, చిన్నారులకు భద్రత లేకుండాపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. బ్యాంకు ఉద్యోగుల కమిటీ అధ్యక్షుడు పవన్, కార్యదర్శి వెంకటేశ్, మహిళా కౌన్సిల్ నాయకులు తేజస్విని, అమూల్య, కవిత, హరీశ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు. – సంగారెడ్డి టౌన్

తీరనున్న డయాలసిస్ కష్టాలు


మరో ఐదు బెడ్లు అందుబాటులోకి

- అదనంగా మూడు కేటాయించాలని రోగుల విన్నపం
- నిత్యం 30 మందికి సేవలు


అందుబాటులోకి వచ్చిన డయాలసిస్ బెడ్లు

జహీరాబాద్: స్థానిక ఏరియా ప్రభుత్వాస్పత్రిలో గల కిడ్నీ డయాలసిస్ కేంద్రానికి మరో ఐదు బెడ్లు కేటాయించారు. ఇప్పటి వరకు 5 బెడ్లు మాత్రమే ఉండడం, బాధితుల సంఖ్య ఎక్కువగా ఉండడంతో వెయిటింగ్ లిస్టులో ఉండిపోవాల్సి వచ్చేది. దీంతో వారు సంగారెడ్డికి వెళ్లి డయాలసిస్ చేసుకోవాల్సి వచ్చేది. ప్రస్తుతం నిత్యం 38 మంది వరకు వస్తుండగా 30 మంది కిడ్నీ బాధితులకు డయాలసిస్ చేస్తున్నారు. 4 నుంచి 5 విడతలు డయాలసిస్ కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం రోజుకు 60 మంది వరకు దాని కోసం ఎదురు చూస్తున్నారు. కొత్తగా 5 బెడ్లు రావడంతో వీరందరికి సేవలు అందుబాటులోకి రానున్నాయి. జిల్లాలో కిడ్నీ బాధితులు అధికంగా ఉండడం, వీరంతా సంగారెడ్డిలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తోంది. అవసరం అయితే హైదరాబాద్‌కు వెళ్లి సేవలు పొందుతున్నారు. ఎక్కడికక్కడే సేవలను అందుబాటులోకి తేవాలని అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం జిల్లాలోని జహీరాబాద్, నారాయణఖేడ్, జోగిపేట ఆస్పత్రుల్లో 5 బెడ్లతో డయాలసిస్ కేంద్రాలను ప్రారంభించింది. జహీరాబాద్ ఆస్పత్రిలో 2018 ఏప్రిల్ 8న డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభించింది. అప్పటి నుంచి 24/7 సేవలను నిర్వహిస్తోంది.

మెరుగైన సేవలు



కిడ్నీ రోగులకు మెరుగైన సేవలందిస్తున్నాం. రేయింబవళ్లు వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటున్నారు. తాజాగా మరో ఐదు బెడ్లు ఏర్పాటు చేయడం వల్ల రోగులకు వేచిచూడాల్సిన అవస్థలు తప్పాయి. వారికి ఎంతో సౌకర్యంగా మారింది.

– డాక్టర్ శ్రీధర్, ఆస్పత్రి సూపరింటిండెంట్, జహీరాబాద్

రూ.10 లక్షలతో అదనపు బెడ్లు

జహీరాబాద్‌లో ప్రభుత్వం రూ.10 లక్షలతో ఐదు అదనపు బెడ్లను డయాలసిస్ కేంద్రంలో ఏర్పాటు చేసింది. మంత్రి దామోదర ఈనెల 20న అదనపు బెడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు రోగులు, కాంగ్రెస్ నాయకులు మరో మూడు బెడ్లను కేటాయించాలని మంత్రిని కోరారు.

క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

సిద్దిపేటరూరల్: మహిళా, శిశు సంక్షేమ శాఖ భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డుల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమశాఖ అధికారి శారద గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 6 నుంచి 18 ఏళ్లలోపు బాల బాలికలు అర్హులని తెలిపారు. సాంస్కృతిక కలలు, క్రీడలు, సమాజ సేవ, పాండిత్యం, సాహస రంగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన బాలలు సంబంధిత సపోర్టింగ్ డాక్యుమెంట్స్‌తో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుల నమోదు ఆన్‌లైన్‌లో మాత్రమే ఉంటుందని, ఎంపికైన బాలలకు డిసెంబర్ 26వ తేదీన వీర్ బాల్ దివాస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని అవార్డులను అందజేయనున్నట్లు తెలిపారు. http://awards.gov.in వెబ్‌సైట్‌లో ఈనెల 31 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఆర్‌ఓఆర్ యాక్ట్‌పై రైతుల అభిప్రాయ సేకరణ

- నేడు సిద్దిపేట కలెక్టర్ కార్యాలయంలో సమావేశం

కోహెడ(హుస్నాబాద్): ధరణిలో నెలకొన్న పెండింగ్ భూ సమస్యల పరిష్కారం కోసం సిద్దిపేట కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం ఆర్‌ఓఆర్ యాక్ట్ పై రైతుల అభిప్రాయాలను తీసుకోనున్నట్లు తహసీల్దార్ సురేఖ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కలెక్టర్ మను చౌదరి కార్యక్రమానికి హాజరవుతారని, మండల రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని అభిప్రాయాలను తెలపాలని కోరారు.

సీసీ కెమెరాలు పట్టించాయ్

- వ్యక్తి మృతికి కారణమైన కారు గుర్తింపు


నిందితుడితో పోలీసులు

వర్గల్(గజ్వేల్): రోడ్డు దాటుతున్న వ్యక్తిని ఢీకొట్టి వెళ్లిపోయిన గుర్తు తెలియని వాహనాన్ని పోలీసులు పట్టుకున్నారు. గౌరారం ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి కథనం మేరకు.. గజ్వేల్‌కు చెందిన చిక్కుడు కిరణ్(30) మంగళవారం రాత్రి గౌరారం వద్ద ఫ్లెక్సీలు కడుతూ రాజీవ్ రహదారి దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో కిరణ్ మృతి చెందగా పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. వాహనం గుర్తింపు కోసం రాజీవ్ రహదారిపై సీసీ కెమెరాలపై ఫోకస్ చేశారు. సిద్దిపేట, ప్రజ్ఞాపూర్, గౌరారం, అలియాబాద్ చౌరస్తా, ఓఆర్‌ఆర్ టోల్‌గేట్ దగ్గర ఉన్న సీసీ కెమెరాల్లో రికార్డును పరిశీలించారు. వీటి ఆధారంగా ప్రమాదానికి కారణమైన ములుగు ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి చెందిన రవి కిరణ్‌ను గుర్తించి పట్టుకున్నారు. గురువారం అరెస్ట్ చేసి కేసు నమోదుచేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కల్తీ మద్యం పట్టివేత


పట్టుబడిన మద్యం, నిందితుడు

జహీరాబాద్ టౌన్: హైదరాబాద్‌కు అక్రమంగా తరలిస్తున్న కల్తీ మద్యం బాటిళ్లను ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. కర్నాటక రాష్ట్రంలోని బీదర్ పట్టణానికి చెందిన అభిషేక్ పండరే కల్తీ మద్యం వ్యాపారం నిర్వహిస్తున్నారు. కొంత మందితో ఒప్పందం చేసుకొని డిఫెన్స్‌కు చెందిన ఖాళీ సీసాలో కల్తీ మద్యం నింపి కారులో బీదర్ నుంచి హైదరాబాద్‌కు సరఫరా చేస్తున్నాడు. గురువారం రాత్రి ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి సిబ్బందితో కలిసి మండలంలోని కొత్తూర్(బి) వద్ద అభిషేక్‌ను పట్టుకున్నారు. రూ.7.50 లక్షల విలువ గల కల్తీ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని అరెస్టు చేసినట్లు సీఐ వివరించారు.

మహిళా క్లినిక్.. సూపర్ సక్సెస్

గ్రామీణ, పట్టణ ప్రాంత పేద మహిళలకు అవసరమైన వైద్య సేవలు అందించేందుకు వీలుగా ప్రవేశపెట్టిన ఆరోగ్య మహిళా క్లినిక్‌లు సత్ఫలితాలనిస్తున్నాయి. జిల్లా కేంద్రం సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల అనుబంధ జనరల్ ఆస్పత్రిలో 8 మార్చి, 2023న గత ప్రభుత్వం ఆరోగ్య మహిళా క్లినిక్ సెంటర్‌ను ప్రారంభించి మహిళలకు వైద్య సేవలు అందిస్తుంది. జిల్లాలోని ముందుగా గుర్తించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానాల్లో మహిళలకు ప్రతీ మంగళవారం వైద్య సిబ్బంది ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. అనంతరం గజ్వేల్ ఏరియా ఆస్పత్రిలో రెండవ ఆరోగ్య మహిళా క్లినిక్‌ను ఏర్పాటు చేసి అందుబాటులోకి తీసుకొచ్చారు. – సిద్దిపేటకమాన్


సిద్దిపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోని ఆరోగ్య మహిళా క్లినిక్ సెంటర్

మహిళల కోసం 'ఆరోగ్య మహిళా క్లినిక్'లు

- సిద్దిపేట జీజీహెచ్, గజ్వేల్ ఏరియా ఆస్పత్రుల్లో కేంద్రాలు
- 16 పీహెచ్‌సీల పరిధిలో ప్రతీ మంగళవారం ఆరోగ్య పరీక్షలు
- ఇప్పటి వరకు 56,466 మందికి..
- 56 మందికి క్యాన్సర్ లక్షణాలు ఉన్నట్లు గుర్తింపు

జిల్లాలోని ట్యాగ్ చేసిన 16 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకున్న మహిళలు, యువతులను సిద్దిపేట ప్రభుత్వాస్పత్రి, గజ్వేల్ ఏరియా ఆస్పత్రులకు రిఫర్ చేసి వైద్య పరీక్షలు, అవసరమైన ఇతర పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేస్తారు. సిద్దిపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, గజ్వేల్ ఏరియా ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన రెండు ఆరోగ్య మహిళా క్లినిక్‌ల ద్వారా ప్రారంభం నుంచి ఇప్పటి వరకు 56,466 మంది రిజిస్ట్రేషన్ చేసుకొని పరీక్షలు నిర్వహించుకున్నారు. ఇందులో అనుమానిత లక్షణాలు ఉన్న 1,792 మందిని ఆస్పత్రులకు రిఫర్ చేశారు. వీరిలో 14 మంది నోటి క్యాన్సర్, 25 మంది రొమ్ము క్యాన్సర్, 17 మంది సర్వైకల్ క్యాన్సర్ లక్షణాలతోపాటు మొత్తం 56 మంది ఉన్నట్లు గుర్తించారు. వీరికి స్థానిక సిద్దిపేట ప్రభుత్వాస్పత్రిలో చికిత్స అందజేసి, మందులు అందజేయడంతోపాటు మరి కొంత మంది హైదరాబాద్‌లోని నిమ్స్, ఎమ్ఎన్‌జే ఆస్పత్రుల్లో ఆరోగ్య శ్రీ ద్వారా ఉచితంగా వైద్య సేవలు పొందుతున్నారు.

25 మందికి బ్రెస్ట్ క్యాన్సర్..

నోటి క్యాన్సర్ విభాగంలో 50,398 మందికి పరీక్షలు నిర్వహించారు. 98 మందిని అనుమానితులుగా గుర్తించి 43 మందిని రిఫర్ చేయగా పలు రకాల పరీక్షలు నిర్వహించి 14 మంది నోటి (ఓరల్) క్యాన్సర్ బాధితులను గుర్తించారు. అదే విధంగా బ్రెస్ట్ క్యాన్సర్ విభాగంలో 48,391 మందికి పరీక్షలు నిర్వహించగా 92 మంది అనుమానితులను గుర్తించి మమోగ్రాం పరీక్షల ద్వారా 25 మంది బాధితులు ఉన్నట్లు తేలింది. స్థానికంగా, హైదరాబాద్‌లో కిమోథెరపీ చికిత్స అందిస్తున్నారు. సర్వైకల్ క్యాన్సర్ విభాగంలో 10,885 మంది మహిళలను పరీక్షించి 139 మంది అనుమానితులను గుర్తించి రిఫర్ చేయగా 17 మంది బాధితులు ఉన్నారు. అదే విధంగా జిల్లాలో మరో 36 మంది మహిళలు సర్వైకల్ క్యాన్సర్ బారిన పడి చికిత్స పొందుతున్నట్లు వైద్యాధికారులు తెలిపారు.

ప్రతీ మంగళవారం ఆరోగ్య పరీక్షలు

జిల్లాలోని సిద్దిపేట ప్రభుత్వాస్పత్రి ఆరోగ్య మహిళా క్లినిక్ సెంటర్‌కు ఇందిరమ్మ కాలనీ, కాశ్లకుంట కాలనీ బస్తీ దవాఖానాలు, తిమ్మాపూర్, చిన్నకోడూరు, బెజ్జంకి, మిర్జాపూర్, ఇందుప్రియాల్, కోహెడ, మద్దూర్, గట్లమల్యాల, ముస్త్యాల (11) పీహెచ్‌సీలు ట్యాగ్ చేయగా, గజ్వేల్ ఏరియా ఆస్పత్రిలోని ఆరోగ్య మహిళా క్లినిక్‌కు సింగన్నగూడెం, తీగుల్, వర్గల్, ములుగు, మర్కూక్ (05) పీహెచ్‌సీలను ట్యాగ్ చేశారు. ఈ పీహెచ్‌సీల పరిధిలో మహిళలు, యువతులకు ప్రతీ మంగళవారం ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. థైరాయిడ్, గర్భాశయం, మోనోపాజ్, మూత్ర సంబంధ వ్యాధులు, కడుపులో నీటి బుడగలు, ఫంగస్ ఇన్ఫెక్షన్స్‌తోపాటు నోటి, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్‌తో బాధపడే వారికి వైద్య సిబ్బంది ప్రాథమిక పరీక్షలు జరిపి నిర్ధారించడం, అనుమానితులను హైయ్యర్ సెంటర్ల (జిల్లా ఆస్పత్రులు)కు రిఫర్ చేస్తున్నారు. వ్యాధి గుర్తిస్తే ఉచితంగా వైద్య చికిత్స అందించి, మందులు అందజేస్తున్నారు.

- ప్రాథమిక దశలోనే గుర్తింపు

మహిళలు ఆరోగ్య సమస్యలతోపాటు పలు రకాల క్యాన్సర్‌ల బారిన పడుతున్నారు. వ్యాధి తీవ్రతరమైన తర్వాత చికిత్స తీసుకోవడం కన్న ప్రాథమిక దశలోనే పరీక్షల ద్వారా వ్యాధి లక్షణాలు గుర్తించి చికిత్స పొందితే పూర్తిగా నయం చేయొచ్చు. ఈ ఆరోగ్య మహిళా క్లినిక్ సెంటర్లు వీటికి ఎంతో దోహదపడుతున్నాయి. జిల్లాలో మరో సెంటర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చి మిగిలిన పీహెచ్‌సీలను ట్యాగ్ చేయాల్సిన అవసరం ఉందని వైద్యాధికారులు సూచిస్తున్నారు.

తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలి



మహిళలు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలి. ఏవైనా అనుమానిత లక్షణాలు ఉంటే సంబంధిత వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించుకోవడం ఉత్తమం. వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించి తగిన చికిత్స తీసుకోవడం ద్వారా త్వరగా, పూర్తిగా వ్యాధిని నయం చేయొచ్చు. మహిళలు, యువతులు మంచి పోషకాహారం తీసుకోవాలి, ఐరన్, కాల్షియం ఎక్కువగా తీసుకోవాలి.

– డాక్టర్ అరుణచందర్, గైనకాలజిస్టు, సిద్దిపేట

ఉచితంగా మందులు అందజేత



ముందుగా ట్యాగ్ చేసిన పీహెచ్‌సీలు, బస్తీ దవాఖానాల్లో ప్రతీ మంగళవారం ప్రాథమిక పరీక్షలు నిర్వహిస్తారు. సిద్దిపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోని ఆరోగ్య మహిళా క్లినిక్ ద్వారా వైద్య సేవలు అందించడం జరుగుతుంది. సంబంధిత విభాగంలో వైద్యులతో మహిళలకు పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేస్తాం.

– శ్రీలత, ఆరోగ్య మహిళా క్లినిక్ సెంటర్ డీఈఓ, సిద్దిపేట

ప్రకృతి సంపద అద్భుతం

- యునైటెడ్ స్టేట్స్ ప్రతినిధి బృందం


కలెక్టర్‌తో మాట్లాడుతున్న బృందం సభ్యులు

మెదక్ కలెక్టరేట్: తెలంగాణ పర్యావరణం, పర్యాటక కార్యకలాపాలు, ప్రకృతి సంపద అద్భుత ప్రతిభా పాటవాలు నేర్పిస్తాయని యునైటెడ్ స్టేట్స్ ప్రతినిధి బృందం సభ్యులు కితాబిచ్చారు. గురువారం జిల్లాలోని నర్సాపూర్, పోచారం, మెదక్ అడవులను, పరిశీలించి, డైగ్రో ఫారెస్ట్రీ, ఫారెస్ట్, ప్లాంటేషన్ యాక్టివిటీస్, టూరిజం యాక్టివిటీస్ సుదీర్ఘంగా పరిశీలించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ రాహుల్‌రాజ్‌తో కమిటీ సభ్యులు సమావేశమయ్యారు. అటవీ కార్యకలాపాలు, ప్లాంటేషన్ టూరిజం వంటి అంశాల్లో జిల్లా ప్రథమంగా ఉందని వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో అటవీ వనరులు ప్రధాన పాత్ర పోషిస్తున్నాయని, పర్యావరణ పరిరక్షణకు గ్రామీణ పేదల జీవనోపాధికి ఉపయోగపడుతున్నాయని అన్నారు. అనంతరం కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. అర్బన్ ఫారెస్ట్ పార్క్ అర్థం చేసుకోవడానికి ప్రకృతి శిబిరాలు బాగున్నాయని తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు మిస్టర్ పాల్ గ్రోవ్, క్లర్క్, ఆల్ ఇండియా డైరెక్టర్ వర్గీస్‌పాల్, చీఫ్ కన్జర్వేటర్, డిప్యూటీ డైరెక్టర్ శర్వణన్, ఫారెస్ట్ ప్లస్ బృందం డాక్టర్ ఉజ్వల్ ప్రధాన్, పార్టీ చీఫ్ ఆశిష్ రాజ్, పార్టీ డిప్యూటీ చీఫ్ గైని సాయిలు, రీజనల్ డైరెక్టర్, తదితరులు పాల్గొన్నారు.

27న బైరాన్‌పల్లికి మంత్రులు

మద్దూరు(హుస్నాబాద్): దూల్మిట్ట మండలంలోని బైరాన్‌పల్లి గ్రామంలో ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ అండ్ బయో డిజిటల్ ఆర్గనైజేషన్ ఇండియా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సావిత్రి బాయిపూలే, జ్యోతిరావు పూలే విగ్రహాల ఆవిష్కరణకు 27న మంత్రులు రానున్నట్లు సంస్థ జాతీయ అధ్యక్షుడు లింగంపల్లి చంద్రశేఖర్ తెలిపారు. మంత్రులు సీతక్క, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు.

పోక్సో కేసుల్లో శిక్షల శాతం పెంచాలి

రాష్ట్ర భరోసా సెంటర్ ప్రాజెక్టు మేనేజర్ జార్జి జోసెఫ్


సిబ్బందితో మాట్లాడుతున్న జార్జి జోసెఫ్

సిద్దిపేటకమాన్: పోక్సో కేసుల్లో శిక్షల శాతం పెంచాలని రాష్ట్ర భరోసా సెంటర్ ప్రాజెక్టు మేనేజర్ జార్జి జోసెఫ్ సిబ్బందికి సూచించారు. సిద్దిపేటలోని భరోసా సెంటర్ ను గురువారం సందర్శించారు. సెంటర్ లో పిల్లలు ఆడుకోవడానికి కేటాయించిన వస్తువులు, ఫర్నిచర్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అన్ని భరోసా సెంటర్ల కన్న సిద్దిపేట భరోసా సెంటర్ ఆహ్లాదకరంగా ఉందన్నారు. సెంటర్‌కు కావాల్సిన ఫర్నిచర్‌ను త్వరలో అందజేస్తామని సిబ్బందిని కూడా పెంచుతామన్నారు. సెంటర్ లో నమోదవుతున్న కేసుల గురించి అడిగి తెలుసుకొని, సెంటర్‌కు వచ్చే పిల్లలు, మహిళల మనోభావాలు దెబ్బతీయకుండా మర్యాదగా మాట్లాడి వారి సమస్యల పరిష్కారానికి కావలసిన లీగల్ సపోర్టు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ స్టేషన్ సీఐ దుర్గా, సిబ్బంది వినోద, సౌమ్య, హరిత రెడ్డి, స్వాతి, మహిళా హోంగార్డులు నవనీత, అనూష, తదితరులు పాల్గొన్నారు.

అమ్మా నీవు లేని జీవితం నాకొద్దు

- ఉరి వేసుకొని బాలిక ఆత్మహత్య

పాపన్నపేట(మెదక్): అమ్మా నీవు లేని జీవితం నాకొద్దని ఓ బాలిక ఉరి వేసుకొని ఆత్మహత్యకి పాల్పడింది. ఈ ఘటన పాపన్నపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని బోడగట్టు గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన కందిపల్లి మల్లేశం భార్య నింగమణి తొమ్మిది నెలల కిందట మృతి చెందింది. అప్పటి నుంచి నింగమణి కూతురు చందు(14) తల్లి గురించి నిత్యం బాధపడుతుంది. ఈ క్రమంలో బుధవారం రాత్రి ఎవరూ లేని సమయంలో ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ శ్రీనివాస్‌గౌడ్ గ్రామానికి చేరుకొని తండ్రి మల్లేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.

చెరువులో పడి యువకుడు మృతి


నవీన్ (ఫైల్)

మిరుదొడ్డి(దుబ్బాక): ప్రమాదవశాత్తు చెరువులో పడి యువకుడు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని మల్లుపల్లిలో చోటు చేసుకుంది. మిరుదొడ్డి ఎస్‌ఐ బోయిని పరశురాములు కథనం మేరకు.. గ్రామానికి చెందిన బంజర్ల యాదమ్మ, లక్ష్మయ్య దంపతుల కుమారుడు నవీన్ (26) తనకున్న రెండు ఎకరాల్లో వ్యవసాయం చేసుకుంటూ భార్య నవనీత, నాలుగేళ్లలోపు ఇద్దరు పిల్లలు రుతిక్, సహస్రలను పోషించుకుంటున్నాడు. గురువారం గ్రామ శివారులోని చౌదరి చెరువు కట్టపై నవీన్ మద్యం సేవించాడు. అనంతరం మూత్ర విసర్జన చేయడానికి వెళ్లి ప్రమాదవశాత్తు కాలు జారి చెరువులో పడి నీటమునిగాడు. చుట్టుపక్కల వారు గమనించి రక్షించే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. రెండు గంటలపాటు గజ ఈతగాళ్లు శ్రమించి నవీన్ మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చారు. మృతుడి భార్య నవనీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి..

రామచంద్రాపురం(పటాన్‌చెరు) : అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. కొల్లూర్ పోలీసుల కథనం మేరకు.. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన జస్వీందర్ సింగ్ (32) నగరంలోని గచ్చిబౌలి ప్రాంతంలో ఓ హోటల్‌లో పని చేస్తున్నాడు. అతడి మిత్రుడు జ్యోత్‌పాల్ తెల్లాపూర్‌లో నివాసం ఉంటుండగా అతడి ఇంటికొచ్చాడు. ఈ సమయంలో జ్యోత్‌పాల్ ఊరికి వెళ్తుండగా నువ్వు వచ్చే వరకు ఇక్కడే ఉంటానని రూమ్‌లో ఉన్నాడు. గురువారం జస్వీందర్ సింగ్ గదిలో నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు గది తలుపులు తీసి చూడగా జస్వీందర్ సింగ్ మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి ఉంది. సీసీ కెమెరాలను పరిశీలించగా జస్వీందర్ సింగ్ 18వ తేదీన ఇంటి నుంచి బయటకు వచ్చి తిరిగి ఇంట్లోకి వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ట్రాక్టర్ టైర్ కిందపడి ఒకరు..

సిద్దిపేటరూరల్: ట్రాక్టర్ కిందపడి వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. నారాయణరావుపేటకు చెందిన మండే రాజు(46) ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గురువారం ట్రాక్టర్‌తో పొలం దున్నేందుకు వెళ్లాడు. పొలం వద్ద గేర్‌లో ఉన్న ట్రాక్టర్‌ను ఆన్ చేయగా ఒక్కసారిగా రాజుపైకి దూసుకొచ్చింది. అక్కడే ఉన్న ట్రాక్టర్ యజమాని కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి సమాచారం అందించి, సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అపూర్వరెడ్డి తెలిపారు.

పాముకాటుతో రైతు మృతి

కంగ్టి(నారాయణఖేడ్): పాము కాటుతో యువ రైతు మృతి చెందాడు. ఈ ఘటన కంగ్టి మండలంలోని జమ్గి(కే) శివారులో గురువారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ విజయ్‌కుమార్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన రైతు సంతోష్(32) ఎనిమిది ఏళ్లుగా లింగంపల్లిలో ప్లంబింగ్ పనులు చేస్తూ భార్య, ఇద్దరు పిల్లలతో జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల జమ్గి(కే)లోని సొంత చేనులో బోరు వేయించి పత్తి, మొక్కజొన్న పంటలు వేశాడు. సంతోష్ బుధవారం రాత్రి పంటలకు నీరు పెట్టేందుకు వెళ్లి గురువారం ఉదయం వరకు రాలేదు. దీంతో అత్త సాయవ్వతో కలిసి భార్య కోటగిరి కవిత వెతకడానికి చేనుకి వెళ్లారు. గుడిసెలో సంతోష్ పడి ఉండగా ఎంత లేపినా లేవలేదు. చేతి వేలుకు పాము కాట్లు ఉండడం చూశారు. పాము కాటుతో మృతి చెందినట్లు నిర్ధారణ చేసుకున్నారు. మృతుడి భార్య కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గుణాత్మకమైన విద్యనందించాలి

డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి


విద్యార్థుల పఠన నైపుణ్యాలను పరిశీలిస్తున్న డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి

మిరుదొడ్డి(దుబ్బాక): గుణాత్మకమైన విద్యను అందించినప్పుడే విద్యార్థులు మంచి సత్ఫలితాలు సాధిస్తారని డీఈఓ శ్రీనివాస్ పేర్కొన్నారు. అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని భూంపల్లి, జంగపల్లి, వీరారెడ్డిపల్లి, ఖాజీపూర్, బేగంపేట, రుద్రారం, కూడవెల్లిలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను, మధ్యాహ్న భోజనాన్ని, విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక వసతులతోపాటు, విద్యాబోధనపై టెన్త్ విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థుల భాషా నైపుణ్యాలను, కనీస అభ్యసనా సామర్థ్యాలను, పఠన నైపుణ్యాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగి ఉన్న పఠనాసక్తిని గుర్తించి నాణ్యమైన విద్యా బోధన చేయడానికి ప్రణాళికలు తయారు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక బోధనా తరగతులు నిర్వహించి వార్షిక పరీక్షలకు సన్నద్ధం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ జోగు ప్రభుదాసు, మండల నోడల్ అధికారి అంజయ్య, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల హామీలు నెరవేరుస్తాం

టీపీసీసీ లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్


అశోక్ గౌడ్‌కు జ్ఞాపికను అందిస్తున్న సతీష్‌గౌడ్, న్యాయవాదులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రజలందరికీ అండగా ఉంటుందని, న్యాయవాదులకు ఇచ్చిన ప్రతీఒక్క హామీని నెరవేరుస్తామని టీపీసీసీ లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో డీసీసీ లీగల్ సెల్ నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..మల్లన్నసాగర్, రంగనాయకసాగర్ ఆయకట్టు పరిధిలోని రైతులను గత ప్రభుత్వం తీవ్ర ఇబ్బందులకు గురి చేసి, అనేక అక్రమ కేసులు పెట్టిందన్నారు. దీంతోపాటుగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలపై అనేక అక్రమ కేసులు నమోదు చేశారన్నారు. వీటన్నింటినీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో పోరాడుతామన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి జిల్లా అడ్వకేట్‌లు, ఇంటి నివాస స్థలాల కోసం రూ.2.25 కోట్లు చెల్లించారన్నారు. కానీ ఇంతవరకు న్యాయవాదులకు పట్టాలు మాత్రం జారీ చేయలేదన్నారు. ఈ విషయం ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోయి పట్టాలు ఇప్పించే విధంగా కృషి చేస్తానన్నారు. అదే విధంగా జిల్లాలో న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి మార్క సతీష్‌కుమార్, సీనియర్ న్యాయవాదులు సాయిబాబా, ఆత్మారాములు, మీసం నాగరాజు, దాస అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఒకే ఇంట్లో నలుగురికి కరెంట్ షాక్

- మహిళ మృతి, ముగ్గురికి గాయాలు


అయిలవ్వ మృతదేహం

చేర్యాల(సిద్దిపేట): మండలం పరిధిలోని ముస్త్యాల గ్రామంలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. ఒకే ఇంట్లో విద్యుదాఘాతానికి గురై మహిళ మృతి చెందగా, మరో ముగ్గురికి గాయాలు అయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన బైర అంజయ్య, భార్య అయిలవ్వ (60) దంపతులు కుమారుడు అనిల్, కోడలు రమ్య, కూతురు శ్యామలతో కలిసి గురువారం పొలం పనులకు వెళ్లారు. అంజయ్య అక్కడే ఉండగా సాయంత్రం పనులు ముగించుకొని మిగితా నలుగురు ఇంటికొస్తుండగా వర్షం కురిసింది. ఇంటికొచ్చి తడిసిన బట్టలను ఇంటి ఆవరణలో ఇనుప వైరుతో కట్టిన దండంపై ఆరేస్తుండగా అయిలవ్వ కరెంట్ షాక్‌కు గురైంది. ఆమెను రక్షించే క్రమంలో మిగితా ముగ్గురు విద్యుత్ షాక్ గురయ్యారు. విషయాన్ని గమనించిన పొరుగింటి బైర ఐలయ్య కర్ర సాయంతో విద్యుత్ సరఫరాను నిలిపివేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. గాయపడిన ముగ్గురిని చికిత్స నిమిత్తం చేర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రాఖీ కట్టేందుకు వెళ్లి వస్తుండగా..

- ఎనిమిదిన్నర తులాల బంగారం చోరీ

పటాన్‌చెరు టౌన్: మహిళ బ్యాగులో నుంచి బంగారం చోరీకి గురైన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పటాన్‌చెరు సాయిరాం నగర్ కాలనీకి చెందిన రాచర్ల పల్లవి 19 వతేదీ ఆమె సోదరుడు బాలకిషన్‌కు రాఖీ కట్టేందుకు కామారెడ్డికి భర్త రాచర్ల అరవింద్, పిల్లలతో కలిసి వెళ్లింది. తిరిగి బుధవారం పటాన్‌చెరుకు వచ్చేందుకు ఆర్టీసీ బస్సు ఎక్కారు. అదే బస్సులో గుర్తు తెలియని ఇద్దరు మహిళలు స్కార్ఫ్ కట్టుకొని ఎక్కారు. పల్లవి చంటి బిడ్డ ఏడుస్తుండటంతో సముదాయించే పనిలో పడింది. ఇదే అదునుగా గుర్తుతెలియని మహిళ పల్లవి బ్యాగ్‌లో నుంచి ఎనిమిదిన్నర తులాల బంగారం దొంగిలించింది. అనంతరం ఇద్దరు మహిళలు బీరంగూడ కమాన్ వద్ద దిగిపోయారు. బుధవారం రాత్రి ఇంటికి వచ్చి బ్యాగ్ చూసుకున్న పల్లవికి బంగారం కనిపించలేదు. గురువారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం.. ఇష్టారాజ్యం

అడ్డదారుల్లో సంపాదిస్తున్న వైన్స్ నిర్వాహకులు

ఆటోలో ఇళ్ల వద్దకే సరఫరా

- పొద్దెక్కక ముందే గ్రామాల్లోకి మందు
- మండలంలో 100కి పైగా బెల్ట్ షాపులు
- ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయాలు

కోహెదరూరల్(హుస్నాబాద్) : నిర్భయంగా మీరు బెల్ట్ షాపులు నడుపుకోండి.. ఏం జరిగిన మేం చూసుకుంటాం.. పోలీసులు, ఎక్సైజ్ అధికారులతో నేను మాట్లాడుకున్నా.. లక్షలకు లక్షలు లైసెన్సు ఫీజు చెల్లించినా అందులో కొంతైనా సంపాదించాలి కదా.. మాకు వ్యాపారం నడిచేది బెల్ట్ షాపులతోనే.. అని కోహెడ మండలం శనిగరం గ్రామంలోని రాజా వైన్స్ యజమాని చెబుతున్న మాటలు. గ్రామాల్లో బెల్ట్ షాపు నడిపించే కొందరికి ఆటోల్లోనే నేరుగా మద్యం సరఫరా చేస్తున్నాడు.. ఇదేంటి అని రెండు రోజుల కిందట మండలంలోని రాంచంద్రాపూర్ గ్రామంలో ఆటోను అడ్డుకొని నిలదీయగా మేము పోలీసు, ఎక్సైజ్ శాఖ అధికారులకు డబ్బులిచ్చాం.. మీరు ఎవరికి చెప్తారో చెప్పుకోండని సదరు వ్యక్తి చెప్పడం విశేషం.

కోహెడ మండలంలో 3 వైన్స్ షాపులు ఉన్నాయి. 27 గ్రామాల్లో సుమారు 100 పైగా బెల్ట్‌షాపులు ఉన్నాయి. ఇందులో రాజా వైన్స్ నిర్వాహకులు ధనార్జనే ధ్యేయంగా ఎక్సైజ్ అధికారుల అండదండలతో బెల్ట్ షాపులను ప్రోత్సహిస్తున్నారు. నిబంధనలు అతిక్రమిస్తూ గ్రామాల్లో బెల్ట్ షాపులకు ఆటోల ద్వారా మద్యం సరఫరా చేస్తున్నారు. బహిరంగంగా రోడ్డుపై గ్రామాల్లోకి వెళ్లి బెల్ట్ షాపు నిర్వాహకులకు కావాల్సిన బ్రాండ్, అవసరమైన మొత్తంలో మద్యం సరఫరా చేస్తున్నారు.

పట్టించుకోని ఎక్సైజ్ శాఖ

గ్రామాల్లో విచ్చల విడిగా బెల్ట్‌షాపుల ద్వారా మద్యం విక్రయాలు జరుగుతున్నా ఎక్సైజ్ అధికారులు మౌన వ్రతం వీడటం లేదు. బెల్ట్‌షాపు నిర్వాహకులు చెప్పినట్లు ఎక్సైజ్ అధికారులు నడుచుకోవడం పరిపాటిగా మారింది. ఎక్సైజ్ శాఖ అధికారులు నిర్ణయించిన వైన్ షాపు నుంచి మాత్రమే బెల్ట్‌షాపు నిర్వాహకులు మద్యం తెచ్చుకోవాలని నిబంధనలు కఠినతరం చేసి మరీ బెల్ట్ షాపులను ప్రోత్సహిస్తున్నారు.


వింజపల్లి గ్రామంలో ఆటోలో మద్యం సరఫరా చేస్తున్న వైన్స్ నిర్వాహకులు

స్టిక్కరింగ్‌తో బెల్ట్ షాపులకు సరఫరా..

వైన్స్ నిర్వాహకులు ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే అధికంగా మద్యం అమ్ముతున్నారు. ఫుల్ బాటిల్ పై రూ.40, బీరుపై రూ.10 నుంచి 20 అధికంగా వసూలు చేస్తున్నారు. బెల్ట్‌షాపుల్లో తమ స్టిక్కర్ ఉన్న మద్యం లేకుంటే వైన్స్ నిర్వాహకులే స్వయంగా దాడులు చేసి మద్యం స్వాధీనం చేసుకోవడం గమనార్హం. ఈ విషయంపై ఎక్సైజ్ సీఐ పవన్‌ని ఫోన్‌లో సంప్రదించగా బెల్ట్‌షాపులు ఎక్కడ ఉన్నాయో తెలియదని ఉంటే చర్యలు తీసుకుంటామన్నారు. కానీ వైన్స్ నిర్వాహకులపై విచారణ చేసి చర్యలు తీసుకుంటామని చెప్పకపోవడం గమనార్హం.